క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాకినాడ రూరల్: వివిధ కారణాల రీత్యా కాకినాడ డి–4 సెక్షన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ గౌతురాజు తెలిపారు. సర్పవరం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాలైన ఏపీఐఐసీ కాలనీ, మురళీధర్ నగర్, సర్పవరం జంక్షన్, స్పెన్సర్స్ ఏరియా, శ్రీనివాసనగర్, బ్యాంక్ కాలనీ, బోట్‌క్లబ్ ఏరియా, ఇండస్ట్రియల్ ఏరియా, రాజీవ్‌గాంధీ కాలేజ్ ఏరియా, ఐశ్వర్యనగర్, బాపన్నదొర కాలనీ, ఈశ్వర్‌నగర్, ఏపీఎస్పీ ఏరియా, రాయుడుపాలెం, ఆర్టీసీ కాలనీ తదితర ప్రాంతాలలో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వివరించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

'రీ సర్వే'ను సద్వినియోగం చేసుకోవాలి



గ్రామ సభలో మాట్లాడుతున్న రూపవతి

కరప: భూ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న రీ సర్వే గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని మండల సర్వేయర్ ఎస్. రూపవతి అన్నారు. మండలంలోని అరట్లకట్టలో బుధవారం జరిగిన రీ సర్వే గ్రామసభలో ఆమె మాట్లాడారు. రైతులు తమ భూములకు సంబంధించి ఎటువంటి సమస్యలున్నా, దస్తావేజుల ప్రకారం భూ విస్తీర్ణంలో వ్యత్యాసాలున్నా, పాస్ పుస్తకాలలో సవరణలు ,చేయాలన్నా, భూముల పంపకాల్లో సర్వే నంబర్ల సబ్ డివిజన్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. రెండు వారాల్లో రైతుల సమక్షంలో సర్వే జరిపి, సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ డి.దుర్గాప్రసాద్, వీఆర్వో పీఎస్ హరిశ్చంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సమ్మేళనంలో డాక్టర్ వేదుల కవిత



డాక్టర్ వేదుల శ్రీరామశర్మ

కాకినాడ రూరల్: పెరూ అంతర్జాతీయ లిటరరీ ఫెస్ట్ అంతర్జాల సమ్మేళనంలో పాల్గొనేందుకు కాకినాడకు చెందిన సాహిత్యవేత్త, కవి డాక్టర్ వేదుల శ్రీరామశర్మ(శిరీష)కు ఆహ్వానం అందింది. ఇండియన్ తెలుగు కవిగా శుక్రవారం ఉదయం 8.30 నుంచి గంట పాటు జరగనున్న ఇంటర్నేషనల్ ఫెస్ట్‌లో తాను తెలుగు స్వీయ కవిత వినిపిస్తానని ఆయన చెప్పారు.

బాక్సింగ్ పోటీల్లో లావణ్య ప్రతిభ



బంగారు పతకం సాధించిన లావణ్యతో ప్రిన్సిపాల్ అనంతలక్ష్మి తదితరులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): ఆదికవి నన్నయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల బాక్సింగ్ పోటీలలో అన్నవరం సత్యదేవి డిగ్రీ కళాశాల విద్యార్థిని సీహెచ్ లావణ్య ప్రతిభను కనబర్చింది. ఈ పోటీలలో బంగారు పతకం సాధించిందని కళాశాల పీడీ డాక్టర్ ప్రమీల రాణి బుధవారం తెలిపారు. డిసెంబర్ 26 నుంచి జనవరి రెండు వరకు పంజాబ్‌లోని గురుకాశి యూనివర్సిటీలో జరిగే ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ బాక్సింగ్ పోటీలకు ఎంపికైందని చెప్పారు. క్రీడాకారిణి లావణ్యను బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.అనంతలక్ష్మి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

సినిమాలు



ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్:	లక్కీ భాస్కర్, అమరన్, బఘీర, సింగం అగైన్
దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్:	భూల్ భులయ్యా–3, లక్కీ భాస్కర్, అమరన్, బఘీర
లక్ష్మి:	క
సత్యగౌరి:	లక్కీ భాస్కర్
తిరుమల:	బఘీర
సిఅండ్‌సీ1:	అమరన్
సీఅండ్‌సీ2:	క
శ్రీప్రియ:	లక్కీ భాస్కర్
పద్మప్రియ:	దేవర
సూర్య1(వాకలపూడి):	లక్కీ భాస్కర్

ధాన్య సిరి దక్కే వేళ..

- ఆశాజనకంగా సార్వా పంట
- కోతలకు సిద్ధమవుతున్న రైతన్నలు
- నియోజకవర్గంలో 24 కొనుగోలు కేంద్రాలు



పక్వ దశలో ఉన్న ముందుగా ఊడ్చిన సార్వా పంట

కరప: సార్వా పంట ఈ ఏడాది ఆశాజనకంగా ఉందని రైతాంగం ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తోంది. సార్వా పంట పక్వ దశకు చేరుకుంది. సీజన్ ప్రారంభంలో వర్షాభావ పరిస్థితులు, ఆ తర్వాత వరస తుపాన్లు రైతులను కలవరపెట్టాయి. ఎట్టకేలకు వాటి నుంచి బయటపడ్డారు. తర్వాత వేసవిని మించిన ఎండలు ఉండటంతో పంటకు ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యాయి. ఒకానొక సమయంలో సాగునీటి ఎద్దడి ఎదురైనా.. తుపాన్లు, వర్షాలు గట్టెక్కించాయి. తొలకరి పంట బాగుందని, మరో రెండు, మూడు వారాలు భగవంతుడు కరుణిస్తే పంట చేతికి అందుతుందని రైతులు ఆశాభావంతో ఉన్నారు.

సీజన్ ఆరంభంలో ప్రతికూల పరిస్థితులు ఎదురైనా కోటి ఆశలతో ఖరీఫ్ సాగు చేశారు. మెరక ప్రాంతాల్లోను, కాలువ శివారు భూముల్లో సాగు ఆలస్యమైంది. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో సాగు విస్తీర్ణం 18,414 ఎకరాలు ఉండగా, కరప మండలంలో 13,952, కాకినాడ రూరల్‌లో 4,462 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో 80 శాతం ఎంటీయూ–7629(స్వర్ణ) రకం, 18 శాతం ఎంటీయూ–1318, మరో రెండు శాతం ఇతర రకాలు సాగు చేశారు.

ఎకరానికి రూ.35 వేలు

ఇలాఉండగా ఎకరానికి ఇంతవరకు రూ 35 వేల వరకు పెట్టుబడులు అయినట్టు రైతులు అంటున్నారు. కూలీ రేట్ల మొదలు ఎరువులు, పురుగు మందుల వరకు ధరలు పెరిగిపోవడంతో, సాగు ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయని వివరించారు. ముందుగా ఊడ్చిన వరిచేలు పక్వ దశలోను, లేత చేలు పాలు పోసుకుని, గింజ గట్టిపడే దశలోను ఉన్నాయి. తుపాన్లు, వర్షాలు రాకుండా, వాతావరణం మరో మూడు వారాలు అనుకూలించి, దోమపోటు వంటి తెగుళ్లు ఆశించకపోతే ఎకరానికి 30 నుంచి 40 బస్తాల దిగుబడి రావచ్చని రైతులు అంచనా వేస్తున్నారు. వాతావరణం అనుకూలించి, తుపాన్లు వంటి ప్రకృతి వైపరీత్యాల నుంచి బయటపడి, పండిన పంట ఇంటికి చేర్చాలని రైతులు భగవంతుడిని ప్రార్థిస్తున్నారు.



పాలు పోసుపోసుకునే దశలో లేత చేలు

వరి కోతలు ప్రారంభం

మండల పరిధిలో ముందుగా ఊడ్చిన పొలాల్లో వరిచేలు పక్వ దశకు చేరుకోగా, విత్తనాల కోసం వేసిన పొలాల్లో కోతలు ప్రారంభమయ్యాయి. మెషీన్‌తో కోయించడానికి ఎకరాకు రూ.2,800 నుంచి రూ.3,500 తీసుకుంటున్నారు. కూలీలతో కోయించడానికి మగవారు రూ.800, మహిళా కూలీలు రూ.400 తీసుకుంటున్నట్టు రైతులు తెలిపారు. నడకుదురు, సిరిగలపల్లంక, వేళంగి, అరట్లకట్ట గ్రామాల్లో కోతలు ప్రారంభించారు. మరో వారం రోజుల్లో సార్వా కోతలు జోరందుకుంటాయని రైతులు వెలుగుబంట్ల రవినాయుడు, నున్న వెంకటేశ్వరరావు తెలిపారు.

16 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



సార్వా కోతలు ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్నాయి. మండలంలో ఇంతవరకు 35 ఎకరాల్లో కోతలు జరిగాయి. పంటకు మద్దతు ధర అందించేందుకు కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలో 24 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుండగా, కరప మండలంలో 16 ఆర్‌బీకేల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. ఈ ఏడాది కనీస మద్దతు ధరగా గ్రేడ్–ఎ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,320, కాగా 75 కిలోల బస్తాకు రూ.1,740, సాధారణ రకం(కామన్) క్వింటాల్‌కు రూ.2,300, కాగా 75 కిలోల బస్తా రూ.1,725 వంతున మద్దతు ధర అందిస్తారు. గతేడాది ఖరీఫ్ సీజన్ కంటే ఈ ఏడాది క్వింటాల్‌కు రూ.117 అధికంగా ప్రభుత్వం నిర్ధారించింది. పంట పక్వ దశకు వచ్చాక కోయాలి, తేమ 17 శాతం లోపు ఉండేలా ఆరబెడితే మద్దతు ధర లభిస్తుంది. మెషీన్‌తో కోయించుకుంటే పెట్టుబడి ఖర్చు ఎకరానికి రూ.నాలుగైదు వేలు తగ్గుతుంది.

– ఏవీ రాజేష్, వ్యవసాయాధికారి, కరప మండలం

ఆశాజనకంగా ఉంది



ఈ ఏడాది తొలకరి పంట ఆశాజనకంగా ఉంది. సీజన్ ఆరంభంలోను సాగునీటి ఇబ్బందులు, తర్వాత వరస తుపాన్ల కారణంగా ప్రతికూల పరిస్థితులు ఏర్పడినా, ఎన్నో వ్యయప్రయాసలతో వాటిని అధిగమించి, నిలదొక్కుకున్నాం. ముందర నాటిన చేలు కోతకు వచ్చాయి. వారం, పది రోజుల్లో కోతలు ముమ్మరంగా జరగుతాయి. తుపాన్ల గండం నుంచి గట్టెక్కించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాం.

– నున్న వెంకటేశ్వరరావు, రైతు, విజయ రాయుడుపాలెం

ప్రవచనాలతో భక్తులకు ఆధ్యాత్మికతపై అవగాహన



ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న సుమంతాచార్ పాటిల్

బోట్‌క్లబ్: భక్తులకు ప్రవచనాల ద్వారా ఆధ్యాత్మికతత్వాన్ని అవగాహన చేసుకోవడానికి వీలుంటుందని విజయవాడ ఉత్తరాది మఠాధికారి సుధాపండితులు సుమంతాచార్ పాటిల్ అన్నారు. స్థానిక రామారావుపేటలోని మధ్వసభ ప్రాంగణంలో మూడు రోజుల పాటు జరిగే ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. మొత్తం 32 అధ్యాయాలు కలిగిన మహాభారత తాత్పర్య నిర్ణయం ద్వారా హరి సర్వోత్తమంతో పాటు, సృష్టి క్రమ విషయాలను కూడా తెలుసుకోవడానికి వీలు కలుగుతుందన్నారు. ఉత్తరాది మఠాధీశులు సత్యాత్మతీర్థ స్వామిజీ అజ్ఞానుసారం తమ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో జ్ఞానయజ్ఞ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మధ్వమతంలో జన్మించడం పూర్వ జన్మ సుకృతంగా భావించాలన్నారు. ఇంతటి అదృష్టాన్ని కలుగజేసిన భగవంతునికి నిత్య కర్మల ద్వారా కృతజ్ఞతాభావాన్ని ప్రకటించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. సుమంతాచార్‌ను మధ్వ కమిటీ కార్యదర్శి కోపెల్లి శేషగిరిరావు భారీ గజమాలతో సత్కరించారు.

సమస్యల పరిష్కారానికి యానిమేటర్ల ఆందోళన



ర్యాలీ నిర్వహిస్తున్న మండల యానిమేటర్లు

కరప: మండలంలోని యానిమేటర్లు(వీఓఏలు) తమ సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం కరపలో ర్యాలీ నిర్వహించారు. కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేస్తామని ఎన్నికలకు ముందు టీడీపీ ఇచ్చిన హామీకి భిన్నంగా.. విజయనగరంలో జరిపిన ప్రెస్‌మీట్‌లో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మూడేళ్లకు యానిమేటర్లను తొలగించే అవకాశం ఉందన్న ప్రకటన నేపథ్యంలో యానిమేటర్ల రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈ ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. మండలంలోని యానిమేటర్లు కరప మండల మహిళా సమాఖ్య భవనానికి చేరుకుని కొద్దిసేపు ధర్నా చేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల యానిమేటర్ల సంఘం ప్రతినిధులు ఎస్. పద్మావతి, ఎం.శ్రీలక్ష్మి, ఎం.లక్ష్మి, ఆర్.సత్యవతి తదితరులు మాట్లాడుతూ, యానిమేటర్లపై రాజకీయ వేధింపులు, తొలగింపులు ఎక్కువయ్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి ప్రకటనలో కింది స్థాయి ఉద్యోగుల తొలగింపులకు మరింత ప్రోత్సాహం లభించిందని, అందుకే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టామన్నారు. గురు, శుక్రవారాల్లో కూడా మండల కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నాలు నిర్వహిస్తామని, ఎంపీడీఓ, తహసీల్దార్లకు వినతిపత్రాలు సమర్పిస్తామని వివరించారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేవరకు దశలవారీగా ఉద్యమాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు

చిన్నారులకు ప్రాణాంతకంగా క్యాన్సర్

కలెక్టర్ షణ్మోహన్ సగిలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: దేశంలో ఏటా 50 వేల మందికి పైగా చిన్నారులు ప్రాణాంతక క్యాన్సర్ బారిన పడుతున్నారని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు. చాలా మందికి క్యాన్సర్ తీవ్రతపై సరైన అవగాహన లేకపోవడంతో ఎంతో మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. చిన్నారుల్లో క్యాన్సర్‌పై అవగాహన కల్పించే లక్ష్యంతో కాకినాడ లయన్స్ క్లబ్ సహస్ర చైల్డ్ హెల్త్ 2కే రన్, వాక్ పేరుతో నిర్వహిస్తున్న చైల్డ్ హుడ్ క్యాన్సర్ కార్యక్రమానికి సంబంధించి రూపొందించిన పోస్టర్‌ను బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్, కాకినాడ లయన్స్ క్లబ్ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. చిన్నారుల క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 10న ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. చిన్నారుల ఆరోగ్యంపై, క్యాన్సర్‌పై అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఆరోగ్యరీత్యా ప్రజల శ్రేయస్సు కోసం ఇటువంటి కార్యక్రమాలు ఉపయుక్తమని తెలిపారు. కాకినాడ లయన్స్ క్లబ్ సహస్ర తరఫున చేస్తున్న కృషిని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ సహస్ర ప్రెసిడెంట్ రేవంత్ కొప్పిశెట్టి, ట్రెజరర్ శ్రీకృష్ణ పురాణపండ, మణికంఠ, రేవంత్ రాజ్, లక్ష్మీ ప్రసన్న, మోనికా, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలకు సంపద ధారాదత్తం

- సీపీఎం నేత శేషబాబ్జి
- 8 నుంచి ప్రజా పోరు ప్రారంభం



కరపత్రాన్ని విడుదల చేస్తున్న సీపీఎం నేతలు

కాకినాడ సిటీ: కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ పాలకులు దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతున్నారని సీపీఎం జిల్లా సీనియర్ నేత దువ్వా శేషబాబ్జి ఆరోపించారు. సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ నుంచి చేపట్టనున్న ప్రజాపోరు కార్యక్రమానికి ఉద్దేశించిన కరపత్రాన్ని బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో పార్టీ ప్రతినిధులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జమిలి ఎన్నికల పేరుతో రాజ్యాంగ మౌలిక స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారన్నారు. ఎన్నికల ముందు కూటమి పార్టీలు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు వేస్తోందని దుయ్యబట్టారు. మద్యాన్ని తక్కువ ధరకు అందిస్తున్నామని గొప్పగా చెబుతున్న పాలకులు.. చేతనైతే బియ్యం నిత్యావసరాల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. పార్టీ నగర కమిటీ సభ్యుడు కె సత్తిరాజు మాట్లాడుతూ, రాష్ట్రంలో యువత ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారన్నారు. గ్రూప్–1, గ్రూప్–2, డీఎస్సీ, పోలీస్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులు సభ్య సమాజాన్ని తలదించుకునేలా చేస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ట్రూ అప్ ఛార్జీల పేరుతో సుమారు రూ.20 వేల కోట్లు ప్రజలపై భారం మోపడం, ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ప్రయత్నించడం తగదన్నారు. నగరంలో ఈ నెల 8వ తేదీ నుంచి వివిధ ప్రాంతాల్లో ప్రజలను కలుసుకుని, వారి సమస్యలు తెలుసుకుని, కరపత్రాలతో ప్రచారం నిర్వహిస్తామన్నారు. ఈ నెల 15న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు పలివెల వీరబాబు, మలక వెంకటరమణ, సీహెచ్ రమణి తదితరులు పాల్గొన్నారు.

క్లినికల్ ల్యాబ్‌కు రూ.8 లక్షల పరికరం



ల్యాబ్‌కు పరికరం అందజేస్తున్న దాతలు

బాలాజీచెరువు: నామమాత్రపు రుసుముతో పేద, మధ్య తరగతి వర్గాల వారికి వైద్య పరీక్షల సేవలు అందించడానికి ఏర్పాటు చేసిన బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్‌కు దాతలు భారీ చేయూతనిచ్చారు. నగరానికి చెందిన బాదం సత్యనారాయణ మూర్తి, సావిత్రి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు శ్రీనివాస్, లక్ష్మి దంపతులు రూ.8 లక్షల విలువైన ఎఫ్ఏహెచ్ఎం(ఫుల్ ఆటోమేటెడ్ హార్మోన్ మెడిసిన్) పరికరాన్ని బుధవారం ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ, ఈ పరికరంతో థైరాయిడ్, విటమిన్స్, కార్డియాక్, రూబెల్లా వంటి పరీక్షలు వేగవంతంగా చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బాదం సుందరరావు, బాదం నాగేశ్వరరావు, డీపీఆర్ స్వామి, ఆర్‌వీ రమణమూర్తి, ఏఆర్ మోహనరావు పాల్గొన్నారు.

బకాయిల విడుదల కోసం ఎస్ఎఫ్ఐ ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆందోళనకారులు



కలెక్టర్ షణ్మోహన్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: పెండింగ్‌లో ఉన్న రూ.3,480 కోట్ల విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ముందుగా విద్యార్థులు పెద్ద సంఖ్యలో బాలాజీ చెరువు సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.వరహాలు, ఎం.గంగాసూరిబాబు మాట్లాడుతూ, కూటమి పార్టీలు అధికారంలోకి రాకముందు విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పాయని, కానీ అధికారంలోకి వచ్చాక విద్యారంగాన్ని కనీసం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ ఏడాదీ ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా వేయకుండా కాలయాపన చేస్తున్నారని దుయ్యబట్టారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయిబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై కళాశాలలకు ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిగ్రీ కళాశాలలో మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేయాలని, దీనివల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇంటర్మీడియెట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరారు. హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు రూ.3 వేలకు పెంచాలని, యూనివర్సిటీల్లో అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం ఈ ఏడాది నుంచే అమలు చేయాలని స్పష్టం చేశారు. అనంతరం కలెక్టర్ షణ్మోహన్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు శ్రీకాంత్, చిన్ని, లోవరాజు, సిద్దు, వెంకటేష్, గోపాలకృష్ణ, జైరాము, సాహిత్, దత్తు, రాజు హేమ, సాయిరాజ్, స్వామి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

దీక్షను విరమింపజేసిన కలెక్టర్



రమణరాజుకు నిమ్మరసం ఇస్తున్న కలెక్టర్

కాకినాడ సిటీ: నగరపాలక సంస్థ పరిధిలో ఎనిమిది గ్రామాలను విలీనం చేయాలని కోరుతూ ప్రముఖ సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు గత నాలుగు రోజులుగా కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరాహార దీక్షను బుధవారం కలెక్టర్ షణ్మోహన్ నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. ఈ సందర్భంగా నిరాహార దీక్షా శిబిరాన్ని కలెక్టర్ షణ్మోహన్ సందర్శించి, ఆయనతో చర్చించారు. ప్రభుత్వం దృష్టికి ఇదివరకే ఈ సమస్యను తీసుకువెళ్లినట్టు కలెక్టర్ చెప్పారు. త్వరితగతిన విలీన గ్రామాలను కాకినాడ నగరంలో కలిపేందుకు కృషి చేస్తానన్నారు. కాకినాడ నగరానికి అనుకుని ఉన్న తూరంగి, ఇంద్రపాలెం, చీడిగ, వాకలపూడి, వలసపాకల, రమణయ్యపేట వంటి 8 గ్రామాలను కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి తీసుకువచ్చి, ఎన్నికలు నిర్వహించాలని రమణరాజు నిరాహార దీక్ష చేశారన్నారు. ఎన్నికల నిర్వహణలో పాటు, 2025–26 ఆర్థిక సంఘం నిధులు వెనక్కి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారన్నారు. ఈ అంశం సుమారు 14 ఏళ్లుగా కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉండడంతో పరిష్కారం కాలేదన్నారు. దీని కారణంగా 8 గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల నిర్వహణ సాధ్యపడడం లేదన్నారు. ఈ అంశాన్ని ప్రభుత్వం, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. ప్రభుత్వ ఉన్నత స్థాయి అధికారులతో చర్చించి, ఆయా గ్రామాలను కాకినాడ నగరంలో విలీనం చేసేందుకు చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు.

వైభవంగా అయ్యప్ప లక్ష బిల్వార్చన

బోట్‌క్లబ్: నగరంలోని భానుగుడి అయ్యప్ప స్వామి ఆలయంలో చోడిశెట్టి నాగేశ్వరరావు గురుస్వామి 18వ శబరిమల యాత్ర సందర్భంగా బుధవారం రాత్రి స్వామివారికి లక్ష బిల్వార్చన పూజ వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి ఆలయంలో ఉన్న 18 మెట్లకు వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. తొలుత విఘ్నేశ్వర స్వామికి, కుమారస్వామికి అష్టోత్తర పూజ నిర్వహించారు. అనంతరం లక్ష బిల్వార్చన వైభవంగా జరిగింది. వేలు గురుస్వామి ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామి వారికి ఘనంగా పుష్పాభిషేకం చేశారు. అయ్యప్ప స్వామి శరణు ఘోషతో స్వామివారి దేవాలయం మార్మోగింది. పడిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో అయ్యప్ప దీక్షాపరులు పాల్గొన్నారు.



18 మెట్లకు పూజ చేస్తున్న చోడిశెట్టి నాగేశ్వరరావు స్వామి



లక్ష బిల్వార్చన పూజలో పాల్గొన్న భక్తులు